# ఎత్తనిని పిడికిళ్ళు....

చుక్క

## 1

ఎప్పటిలాగే- నిన్నటిలాగే- పల్లె లేచింది. బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంది. వెలుగునిచ్చే సూరీడు అప్పుడే పొత్తిళ్ళలో పొర్లాడే పసిగుడ్డులా, ఎఱ్ఱని మందారంలా, ముద్దబంతి పువ్వులా, నింగిమీద నిలిచాడు. తెల్లని సూర్యకిరణాలు లోకానికి వెచ్చదనాన్నందజెయ్యాలని ఆరాటపడుతున్నాయి. కోడి కూసి చాలా సేపయ్యింది.

* * *

"ఏమత్తా! ఏమొ, మా మర్దలు పండుక్కు రాకపాయె? మా తమ్మన్ని గంక ఇడ్సి ఉండలేదన్నదా ఏంది నీ బిడ్డ?" అన్నది ఈరమ్మ నవ్వుతూ, కొంగుని నడుం సుట్టు బిగించి, కుండలో పేడనీళ్ళు కలియపెడ్తూ.

"ఏందోనే ఈరా, ఈ కాలపోరగండ్ల దేందోగానీ 'అద్దాలనాడే బిడ్డలుగానీ, గడ్డాలచ్చినంక బిడ్డలా!' అన్నరట ఎన్కటి కెవరో. లగ్గమయి మొగనింటికి బోతే సాలు, ఇగయ్యావ్వలు సచ్చిన్రా, బతికిన్రా అని తిర్గి సూడరు."

"నువ్వన్నా జెప్పే ఈరా, నాకు మాత్రం ఎందరున్నరు సూస్కోని మురువటాన్కి? అదొక్కతేనాయె. బిడ్డ లేంది పండుగెట్టయితదని తోల్కరాను బోతే, పనాడ మావచ్చిందన్న గ్యానమున్నుండద్దె దాన్దగ్గిర- 'అవ్వా! నేనాదికత్తె అల్లునికీడ బువ్వండుకునుడు లిప్పలు గాదా- నేన్రానే!' అన్నది-" ఆగి కళ్ళనీళ్ళు తుడ్సుకున్నది లస్మమ్మ.

"ఏడ్సుడెందుకత్త! ఆడ మా తమ్మనికి సూత ఎన్కముందెవలున్నరు? ఎటు జెట్టినా నీ ముద్దులబిడ్డ దప్ప. పోనియిమరి ఇద్దర్నీ కల్సి రమ్మంటయిపోతది గద- ఏడ్సుడు తూడ్సుడేంది మల్ల."

"పాపం, మా అల్లున్కి తెల్లారేసి మొక్కాలేవ్. 'లచ్చిమీ! మీయవ్వ మన్సు బడి, పిలకొద్దచ్చే- పోరాదు. నాది నేనూసుకుంట గనీ, నువ్వయితే పోరాదన్నడు. ఆకర్కి ఇగేంజెప్పిన యినదని ఇద్దర్ని రమ్మన్జెప్పిన. అయినకు రెండు జాగల్ల యాతంబోసుడుండె. ఇగ నా ముకంజూసి అత్తనన్నదే. ఓయాళ్ళ ఈడికి జొంపొద్దాల్లకు సేరత్తరు గావచ్చు."

"నేనెప్పలేదత్త! ఎదిగిన్రంటె అలుమొగలు ఆళ్ళే కల్సుంటరని. నీకు యాదికున్నదోలేదో, నీ బిడ్డ పంచాలప్పుడు- నీకేలి లేనందుకు నన్నిట్టమొచ్చినట్టు తిట్టినవ్." నవ్వుతూ అన్నది ఈరమ్మ.

పేడనీళ్ళు కలియబెట్టడం అవగానే, ముంతతోటి వాకిట్లో అలుకు జల్లసాగింది.

"పాడు పోరి! పండుగపూట గయన్నెందుకులేయే– అయినా కోడలా, నీమీన నాకాయింత పెద్దిరికం లేదంటవా? ఎంతైనా నేను పరాయిదాన్నయితిని– నీ మొగడు నా కొడుక్కాదాయె– నువు నా కోడలువు కాదయితివి–" అంది జీరగా లస్మమ్మ.

"అదేందత్త గట్లంటవు– నీ కొడుకునూ, నన్ను మీ ఇంట్లనే ఉంచుకోరాదు. పోరగాండ్లతో ఏగలేకున్న– మంచిగ పోరగాండ్లను నువ్వొర్సుకుందువు, ఇంటి పనంత నేన్నూసుకుంట."

"నాకంత అదురుట్టమా! నా గీతే మంచిదయితె నా కడుపే పండేది. అయితే మానేగాని, ఇయ్యాల బువ్వ గివ్వ ఏమండకు– అందరు మాయింట్లనే తిందురుగని."

"ఏందత్త! నువ్వేందో అంటవు. మీ ఇంటికి మేమచ్చుడేంది? మా ఇంటికే మీర్రారాదుర్రి." నవ్వుకుంట అన్నది ఈరమ్మ.

తమింటి ముందు అలుకు జల్లడం అయిపోగానే. అట్టాగే లస్మమ్మ ఇంటి ముందు వాకిట్లో కూడ అలుకు జల్లింది, ఈరమ్మ. అదీ యీరమ్మకు మామూలే.

"ఏందే కోడలా! నన్నసలు మాట్లాడనియ్యవే. నీతోని ఏమ్మాట్లాడినా గోసనే." నవ్వింది, లస్మమ్మ కూడా.

"నా కొడుకు లేసినాడే ఈరా! పిల్లగాండ్ల ఇంక లేవనట్టున్నరు గద."

"నీ కొడుకా....! నీ కొడుకు ఇల్లెందుకత్తా? రాత్రింట్ల పంటేగద? యేటా బతుకమలకు తనే పువ్వు దెచ్చేటోడు ఈయ్యేడు సున్నా. నిన్న మాపటీల నేనే పెరట్లకుబోయి అంచెడంత పువ్వు గోసుకొచ్చిన. రాత్రింట్ల బండకపాయె. ఇగింత పొద్దెక్కవత్తాన్నా జాడ లేడాయె. ఇగ నీ కొడుకుతోని నే నేగియ్య నత్తా! ఇంట్ల పెండ్లామనేదుంటదని మర్సిపోతడేందో అప్పుడప్పుడు. అచ్చినంక నువ్వాన్నా జెప్పత్తా!" అని అలుకు చల్లిన వాకిట్లో ముగ్గులు వేయడానికి సుద్దడబ్బ కోసం యింట్లోకి పోయింది యీరమ్మ.

*            *            *

"అన్నలార! అక్కలార! ఊర్లున్న పజలందరికీ సంగపోల్లు తెల్యపర్తున్నదేందంటే–

"ఏమేటా, మనందరం. బతుకమ్మ పండుగనాడు, మనూరి దొరగారి గడీ ముందట సావిట్లో బతుకమ్మ ఆటాడు కుంటున్నం. అడ్కనే మన అక్కలను, అవ్వ

117

లను, సెల్లెల్లను, పెండ్లాలను ఆకర్కి బిడ్డల్ను గూడ, కుర్సీ మీన కూసుండి. మంచిగ సిగిరెట్లు దాక్కుంట, పొగూదుకుంట, దొరగారు సూత్తుండడం మంచిదేనా....

"ఊర్లె ఎవ్వలు మంచిగ అందంగ ఉన్నరా- అని సూసుకుంట, అళ్ళ పెళ్ళాం పిల్లలకంటె- మంచి బట్టలు- నగలు పెట్కున్న మన ఆడోల్లను- 'ఇంత మంచిగ సోకు జేస్కును డెందుకే! తెల్లార్లెత్తె ఎద్దు గుద్ద పొడ్సుకు నెదోల్లు, అని అనడం మంచి దంటారా?"

"అయినా మనం ఇన్ని రోజులు- గాడిదలోలె అన్ని సహించినం. ఎందుకంటే: దొరోరు పెద్దోరు, అధికారం పలుకుబడీగలోడు అనీ, డబ్బుగలోడు అనీ, ఏమంటే ఏమయితదోనని, నోర్లు మూసుకున్నం.

"మరి. దోరోరు! మన్సికాడా? ఆయినకు కాళ్ళు, సేతులు, ముక్కు, మొకం లేవా? ఆయినకు పెళ్ళం, పిల్లల్లేరా? మరాయన పెత్తనం, దవుర్జన్యం ఇంకా ఇంకెన్ని రోజుల్ నడువాలె?

మనందరం ఒక్కటయితే, ఇసోంటి దొరలు పదిమందచ్చినా మనల్నేం జెయ్యరు, పేదోళ్ళమంత ఒక్కట్కావాలె.

"యాట మన ఆడోళ్ళందరు దొరోరి గడిముంగట సావిట్ల బత్కమ్మ లాడు కోడం అసారమయిపోయింది. అదే? అద్నే ఎందుకాడోక్కావాలె? దొరోరి గడిముం దద్నే బత్కమ్మ లాడుకుంటనే- బత్కమ్మ పండగ జేస్కున్నట్టా?

"ఇయ్యాల్ల బతుకమ్మ ఎవ్వలాడల వాల్లే ఆడుకోవాళే"....

* * *

చాటింపు సాగుతానే వున్నది- ఇంకా చిక్కగవుతున్న ఎండ పొడలా.

"ఏందత్తా! ఏందో సాటింపేత్తాన్రు? మల్లేమన్న పైసల్గిట్ల అసూలు చేత్తనరా యేంది" అన్నది ఈరమ్మ, ఇంట్లోంచి బయటికి వచ్చి.

"అయ్యో! సాటింపు నీకిన్రాలేదె? నీ మన్సంత నా కొడుకుమీన్నే ఉన్నట్టు న్నది. పైసల్ అసూల్ జేసుడు గాదు గనీ, ఈయ్యేడట బత్కమ్మల్నట దొరోరి సావిట్ల ఆడద్దట, అన్నంగపోలు సాటింపు చేస్తాన్రు. ఈ సంగప్పోరగాండ్లకు పిస్స లేసినట్టున్నది. తాతముత్తాతల్నుంచి అత్తున్నది ఒక్క రోజుల కుర్సీ కూసుండు మంటె కుదుర్తాది!"

"నా కొడుకు నాత్రియింటికి రాలేదంటివి? ఇన్నవా? నా కొడుకేం జేసిండో, సంగపోల్లేం జేత్తనో!" అన్నది లస్మమ్మ.

"సాల్లే, సంబురం! ఎంత సంగపోల్లయితేంది అసారాన్ని కాదంటమా? అయినా ఈనెకు ఎంత జెప్పినా ఇనడత్తా. ఆ సంగంల ఉండుడెందుకు? దొరోరి కంట్లె పడుడెందుకూ? ఏదో ఉన్నకాడ్కి కట్టం జేసోకొని కలో గంజో తాగి బత్కక?" అన్నది ఈరమ్మ. ఆమె మనసు క్షణకాలం గతంలోకి పోయింది.

తనకు కొత్తగా పెళ్ళయినేడు. అయ్య దోల్కపోసచ్చినా, అత్త మామల్లోల లేదు. ఆళ్ళకు మాత్రిం ఎవరుండె? ఉన్నొక్క కొడుకు బొంబాయికి పోయె. పోయి మూడ్నెల్లగ్గావచ్చె- తన పెనిమిటి అచ్చినాంక- ఇంట్లోళ్ళం చెప్పకున్నా, బయట ఎవరన్నా జెప్పరా? దొర మీన కారాలు మిరాలు నూరిండు. తనూ, అత్తమామలూ కాలుగడ్పులు మొక్కి ఎట్లనో సాంతింప జేసిన్రు.

అనాడు దొర ఏమన్నడు...?

"ఏందే! నీ మగన్కి సంపాందన గిట్ట ఎక్కువయ్యిందా ఏంది? అవుగానీ నీ మొగుడు బొంబాయికి బోయిండేమో? ఈ సుక్కల సీరా అదే బంపిచ్చిండా- లేకుంటే ఎవ్వడన్నా కొనిచ్చిండా! ఎందుకంటె! అడ సంపాదన ఆనికే సరిపోతలేదట గద? తెల్లారేత్తె ఎద్దు గుద్ద బొడ్సుకునే దానివి, మొగడేద్నో బొంబాయిలుండెనా నీకీడింత సోకు లెందుకే....?"

కళ్ళలో నీళ్ళు తిరిగినయ్.

"ఏందే ఈరా! కండ్లల్ల నీరు నిండవట్టె?" అడిగింది లస్మమ్మ.

"ఉహూఁ ఏం లేదత్త! ఏందో యాదికచ్చింది-" కళ్ళు తుడుసుకున్నది.

"తన పెనిమిటి సెడ్డ పనుల్ సేత్తలేడు- ఎవర్నీ అన్నాయం సేత్తలేడు- దొంగతనం లంజెతనం జేత్తలేడు- కానీ తన కొక్కటే బయ్యం- తన పెన్మిటి దొరకు ఎదురు తిరుగుతాండు. దొరంటే పెద్దలోకు మనిషి. వాన్ది పాము పగ- దొరోరి కంట్లెబడితే అన్నీ కట్టాలేన్రా అని సచ్చెదనుక అత్త చెప్పింది. అదే తన బయ్యం, బుగులు-" ఈరమ్మ కంటికొలుకుల్లోంచి రెండు కన్నీటి చుక్కలు రాలినయ్.

"ఇది నిజంగా జరుగుద్దా అత్తా! ఎవరెట్లపోతె ఈయినెకేంది? ఆ సంగం బుండి బరుగబెట్టుకునేదేంది? సల్లురి కంట్లెబడుడు తప్ప-" బరువుగా నిట్టూర్చింది.

చిప్పలోని సుద్దపొడిని కుడిచేతి పిడికిలినిండా అందుకున్నది. వాకిట్లో ముగ్గులు పరిచింది. ఆకుపచ్చగాఉండే కళ్ళాపిమీద తెల్లని ముగ్గులు ముత్యాలదండల్లా ఉన్నాయి.

"అవ్వా!".... పిల్లలు లేచినట్టున్నారు. అయిదేళ్ళ కూతురు లచ్చిమి లేచి రాగం అందుకుంది. నిద్దర్లేచే సరికి ఎదురుగా కన్నతల్లి కనిపించలేదు.

"నా తల్లివి కాదె? నా ముత్యాల మూటవి కాదె? సూడు అన్న లేసిండా— కసేపు పడ్కో—!" బిడ్డని లాలింప జూసిందిగానీ, ఆ చిన్నది విన్లేదు. తల్లి కొంగు వదలి ఉండలేదు ఆ పసిది.

ఇంతలో బయట ఎవరో వస్తున్నట్టు చెప్పుల సవ్వడి—

"అవ్వని ఏడ్పిస్తాన్నావ్, నా కన్నతల్లివి గాదు— యిగ రా."

అదివరకే వెనుతిరిగి చూసింది ఈరమ్మ. ఆ చెప్పుల సవ్వడి తన పాణం.

తల్లి భుజాలమీద ఒర్గిన లచ్మి తండ్రి చేతుల్లోకి జారిపోయింది.

"వచ్చినావయ్యా! కసేపు నీ బిడ్డని ఆడించు— నా పని నేను జూసుకుంట."

"ఇదెక్కడి విచిత్రపబ్బా? నా బిడ్డా? నువు లెందే నేనెక్కడ కంటి?" మల్లయ్య నివ్వాడు.

"సాల్లే సరసం— అద్సరె గనీ.... ఆ సాటింపిన్నవా?"

"అదా?"

"నాగ్గూడ దెల్సు— నేంగూడా యిన్న కనీ.... అయ్యన్నీ మన కెందుకు? ఏదో మన మానాన మనం బత్కుదాం— నల్గురి కండ్లల్ల నల్సు గావడం ఎందుకు? పెద్దలోకుల్తోని పెట్టుకునుడెందుకు?" అన్నది మెల్లగా తన దీపం మీది ప్రేమతో.

ఏం మాట్లాడలేదు మల్లయ్య. కొద్దిసేపు ఇద్దరిమధ్య మౌనం రాజ్యం చేసింది.

"ఈరా! నేనేం పాడుపని చేస్తలేను. దొర సంగతి నీకు దెల్సు. ఊళ్ళె అందరికి దెల్సు. కాని వాళ్ళకు ఏమంటే ఏమయితదో, దొరకెదురు తిర్గితే ఏమయి తదోనని భయం. కానీ ఇప్పుడు నా అసొంటేళ్ళే గాదు ఊరంతా సంగం పేరుతో ఒక్కటయితున్నరు. వాళ్ళేదో చెయ్యాలన్నరు— అదే చెయ్యబోతున్నరు. ఏద్జేసినా సంగమే జేస్తది గనీ నేనుగాదు. ఈరా! దీంట్ల నా ఒక్కనిదేంవున్నది?"

"అవునయ్యా, అదే!.... చేసేది సంగమే— గానీ సేయించేదంతా నువ్వేగద? సంగానికి పెద్దవు నువ్వేగద? సంగాన్ని నడ్పించేది నువ్వేగద?" దాదాపు శోకం అందు కుంది ఈరమ్మ.

"ఈరా ! నువ్వు ఏడ్సుడేం బాగలేదు_" భార్య దగ్గరగా జరిగి నెత్తిని కుడి చేతితో నిమిరాడు.

"నా మన్సంతా నీమీదేనయ్యా_" అతని ఎదపై తలనాన్చింది.

*　　　*　　　*

గ్రామమంతా ఉడ్కిపోతున్నది.

"దొరోరి సావిట్ల బత్కమ్మలాడుడు ఏనాటినుంచో అత్తున్న అచారమాయె_ ఆ అచారం ఇప్పటప్పటిది కాదు_ తరతరాల్నుంచీ తాత ముత్తాతల్నుంచి వస్తాంది. ఏక్దమ్మున ఇయ్యాలది మారాల్నంటె జర్గేపనేనా ?"

ఎవరికివారే ఉడికిపోతున్నరు_ ఆలోచిస్తున్నరు.

కొందరు సంతోషపడుతున్నారు.

కొందరు ముక్కుమీద వేళ్ళేసుకుంటున్నరు.

మరింతవరకు అదేమిటన్న నాధుడే లేడాయె....

## 2

"పోశాలు ! నువ్వన్నా సెప్పకపోతివి_ నా సంగతి నీకుసత డెల్వదా ? నేనెవ్వ ల్నన్న ఏమన్న అన్ననా ? సిన్నప్పట్నుంచి మా గునం నీకెర్కే కద ! నువ్వంటే నేనెంత మర్యాద ఇచ్చేటోన్నో ?.... ఇయ్యాల ఆ మల్లయ్య, అని సంగం నా మీద లేనిపోని నిందలు పుట్టించి నన్నెంత అల్లరి జేత్తన్రో ! ఓయాల్ల ఎప్పుడన్నా తెల్సో తెల్వకనో ఏమన్న జరిగిందనుకో_ పెద్దమన్సలు మీరంత లేరా ? అయ్యా బాంచెన్ ఇది తప్పంటే, అప్పుడ్నే నొప్పుకోకపోతే అనున్రి.

ఈ వూర్లె పెద్దమనుషులు, నా సిన్నప్పట్నుంచీ ఏన్నో పంచాతులు జెప్పినోల్లు అసోంటి మీక్కన్పడని సెడ్డబుద్దులు, అనికి_ అని సంగానికి కనిపించినయా ! అంటే ఆ మల్లయ్య కండ్లకు మీరంతా సచ్చు దద్దమ్మలన్న మాట ! అదీ ఇడ్సిపెట్టు. మనల్ని వాల్లనకపోతే ఎవలంటరు ? అంటే అననీ. బతుకమ్మంటె అచ్చంగా గౌరమ్మను పూజించుడె కదా ? అసోంటి గౌరమ్మను పతేటా కొలిసే సావిట్ల కాదని, యాడ్నో మూడుబజార్ల కాడ కొలుత్తమంటే ఆ దేవత వూకుంటదా ? ఇగ ఆ గౌరమ్మకు కోపమత్తె, ఇగ మన పెండ్లాం పిల్లలకు సుకం జరుగుద్దా? పాడిపసువులు సల్లగుంటయా? మీరే సెప్పునిర్రి ?" ఒరుగుడు కుర్చీలోంచి కాస్తా ముందుకు జరిగి సిగిరేటు అంటించు కున్నాడు_ దొర.

"పోశాలూ ! అంతా ఇవరంగ ఇన్నరు కదా ? అది నేను సెపుతున్నది కాదు. రాత్రి గౌరమ్మ పసుపు బట్టలు కట్టుకోని, ముక్కుపుల్ల పెట్టుకోని, నడుముకు వడ్డాణం పెట్టుకోని కలలకచ్చి ఇదంతా సెప్పింది."

దొర గుప్పున బయటికి వదలిన పొగ, చిన్న మబ్బుతునకలా అన్పించింది అందరికి.

ఆ గ్రామం పెద్దమనుషులు గుసగుస లాడుకున్నరు. చెవులు కొరుక్కున్నరు.

"బాంచెన్ దొరా ! మీ గులాపోల్లం— మీర్జెప్పిందంతా మంచిగనే ఉన్నది— లంజకొడుకు ఆ మల్లనికి, ఆని సంగాన్కి సుతమంత బుద్దిలేదు. తాత ముత్తాతల్నుంచీ వత్తన్న ఆచారమాయె— కాలదంతే పుర్గులబడి సావమా ?" అన్నడు కులపెద్ద పోశాలు.

ఒకరిద్దరు తందానా.... అంటూ తాళం వేశారు.

కొందరేమ్మాట్లాడలేదు కానీ బుర్రలూపారు. వాళ్ళ గుండెల్లో వేరే గుస గుసుంది.

"అయితె ఇప్పుడు ఏం సేద్దామంటరు ? ఓటి మాంఛి అయిడియా ! మా సుంక రోన్ని సాటింపుకు తోలుత— ఆ సంగపోల్ల మాటెవ్వలు ఇనద్దని, తాత ముత్తాత ల్నుంచి అత్తన్న ఆచారాన్ని కాదని ఊరికరిట్టం తేవద్దని" అన్నడు దొర.

పెద్దలు తలలూపారు. దొరోరి మాట బావుందంటే బావుందన్నారు. ఇగ మేమెల్తామన్నట్టు లేచారు.

"అదేంది, మరి ? మా గడిలకొచ్చి ఛాయన్న తాగకనె పోతరా ?" టీ తెమ్మని ఇంట్లోకి కేకేసాడు.

దొరవారిది దొడ్డమనసని పెద్ద మనుషులందరు అనుకున్నరు.

"అరె కొంగా ! నువుపోయి వూర్లె సాటింపెయ్యి" పురమాయించాడు దొర.

కొంరడు బుర్రాడించాడు. వాడి కళ్ళకింకా జ్ఞాపకమున్నది; పోయినేడు తన సెల్లె ఇస్త్రీ సేయించుకొని కొత్త సీర గట్టుకొని, దానత్తగారు బెట్టిన చెవులకమ్మలు, పట్టగొలుసులు, బెట్టుకొని. సావిట్లకు బతుకమ్మాట సూడచ్చింది.

"ఏందే పోరీ కతా ! నీ మొగని పెండ్లాన్ని.... మీమాదిగులకు బతుకమ్మ పండుగేలేదాయె ? మరి నువ్వు సొన్లంజ తీర్గ సోకు జేసుకొనచ్చిన వేందే !" అన్నడు దొర అప్పుడు.

122

ఈ యేడు పండుక్కు దాన్ని తోల్కరానుబోతే, పీదవడి ఏడ్సింది.

"అన్నా పండుగులకు నేనావూరు రానే?" అన్నది.

కొంరని గుండె అవిసింది. కళ్ళవెంట నీళ్ళు కారడమే తక్కువ. జరిగింది గుర్తు కొచ్చింది మనుసుకు.

ఇంటితోవబట్టాడు. చాటింపు జేయడానికి, డప్పు తీసుకురాను.

తోవలో కలిసాడు చలపతి.

చలపతికి ఇరవయ్యేళ్ళుంటాయి. పట్నంలో చదువుకునేవాడు. మధ్యతరగతి కుటుంబం. గడవక, చదువు చాలించి, వూళ్ళోనే వుంటూ వ్యవసాయం చూసుకుంటున్నాడు.

చలపతి కన్పడేసరికి కొంరనికి కొండంత బలమొచ్చింది.

'సలపతి బాబూ,' పిలిచాడు.

ఆగాడు చలపతి. "ఏందే కొంరన్నా! బాబనద్దని నీకెన్నిసార్లు జెప్పిన. ఏందో కత." అన్నాడు.

చెప్పాడు కొంరడు జరిగిందంత. కనుబొమ్మలు ఎగిరేసాడు చలపతి. "నేను ముందే అనుకున్న.... నీ పని నువు చూసుకోవే- కొంరన్నా!"

కొంరని భుజం తట్టాడు.

వడివడిగా అడుగులేసాడు.

* * *

రెండు జాముల వేళ దాటిపోయింది.

ఆకాశం మీద మబ్బులు పరచుకున్నాయి. ఆకాశమంతా ఎర్గలి తడకలా వుంది.

బతుకమ్మ లాటకు సింగారించుకునే ఆడజనమంతా ఆగిపోయింది. "ఇగ సింగారించుకొనుడు ఎందుకు? ఏట్ల బెట్టనా? ముందే ఆన మొగులు గాబట్టె. అయింత ఆనందుకుంటె. కొత్త సీరా- సింగారం పాడయిపోతయ్. ఓ యాళ్ళ ఆనే బడితే ఇగ ఆటెక్కడిది? సేతులు ముడుసుకొని, సేసుకున్న పిండి ముద్దల్ని సప్పరించుడే"

"అమ్మా గౌరమ్మ! యాడాదికోదిసం.... ఈ ఆన మొగులు ఇయ్యాళే రావాల్నా! నువ్వన్నా ఆ ఆన దేవునికి జెప్పు. ఇయ్యాల ఆన గొట్టద్దని."

దొరవారి పంచతంత్రాలు, నీతిబోధలు, మూతి మీసాల కంటించుకున్న పెద్ద మనుషులు ఆ సమయంలోనే పాచికలాట మొదలెట్టారు.

"ఏం లేదు. ఇగ-ఆ గౌరమ్మకు కోపమచ్చింది. గౌరమ్మ మగడు మూడో కన్ను తెరుత్తున్నడు. తాత ముత్తాతల్నుంచి వత్తున్న ఆసారాన్ని సీ: కాదంటే మన్సులకు మంచిదా? లేపోతే నిన్న-మొన్న బుట్టి ఇయ్యాల బుడ్డగోసి బెట్టిన పోరగాండ్లు ఇన్ని బాగోతాలేత్తరా! ఇగ యీ వూరుకు ఏదో సని జుట్టుకున్నట్టే- ఇగ ఆ దేవున్కి- సాంతి బెట్టంది లాబం లేదు.

కొందరవునంటె అవునన్నారు. కొందఁహాఁ అన్నారు.

దొర మనుషులు వూళ్ళో తిరగడం ఎక్కువయింది. ఆ మనుషులు ఎవరి మీదికీ పోవడం లేదుగానీ, గీతబోధలు చేస్తున్నారు. వాళ్ళ గీతోపదేశం చేస్తున్నపుడల్లా వచ్చే నాటు సారాయి ఘాటైన వాసన దిక్కులకు వ్యాపిస్తున్నది.

అసలు తామేం మాట్లాడ్తున్నాం అనేది వాళ్ళకు తెలియకున్నా జనానికి తెలుస్తున్నది వినేవాళ్ళు వింటున్నారు. చీదరించుకునే వాళ్ళుసైతం వింటున్నారు.

నీళ్ళబోసుకున్న మొగులు నీళ్ళాడింది. పావుగంట దాకా వర్షపు ధారలు.

సింగిడి[1] బొడిసింది. మబ్బుల నడుమ నుంచి ఎండ పొడుచుక రాసాగింది. ఈదుల్లో[2] వాన నీరు జరజరా పాఁపోతోంది. పోరగాళ్ళు కొత్త బట్టలు తొడుక్కున్నా ఈదుల్లకు వచ్చి పచ్చి మన్నుతో పిచ్చికగూళ్ళు కడ్తున్నారు- అది చూసి తల్లిదండ్రులు వీపు మీద రెండు అంటించేదాకా.

భూమంతా మైల దీసేసినట్టున్నది.

ఆడజనం గుండె మీద చెయ్యేసుకున్నారు- 'అమ్మయ్యో' అనుకుంటూ.

* * *

అది సంగం.

వూళ్లో చాలామంది పడచువాళ్ళు దానికి చుట్టాలే.

"అందరిన్నరా, ఇగ ఈదుల్లకుబోయి అందరికీ నచ్చజెప్పాలె. ఓయాళ్ళ ఎవ్వలేమన్నన్నా, అల్లనేమనొద్దు, అల్లకు సుత నచ్చజెప్పాలె" అన్నడు చలపతి.

"ఇగీడ మాట్లాడుకుంట గూసుంటె పనిగాదు ఇగ లేద్దాం" అన్నడు మల్లయ్య.

అందరు లేచారు సంగం బయటకు వచ్చారు.

తలుపుదగ్గర ఎవలో పొంచి వింటున్నారు.

---

1. ఇంద్ర ధనుస్సు 2. ఈత చెట్లలో

124

'ఏందే పోశాల్తాత? నువ్వా? ఏందే పరి గీడనిల్సున్నవ్? లోపలకొచ్చి కూసుండక పోతివి? దాయె పూర్లెకి పోదాం అన్నాడు పల్లయ్య, అంటూనే పోశాల్తాత చెయ్యిపట్టుకున్నాడు, రమ్మన్నట్టు.

"ఏహె ఏం లేత్తాలే. ఇప్పుడే అచ్చిన లోపలి కత్తె ఏమనుకుంటరోనని, ఇగీడనేనిల్సున్న!" తప్పదన్నట్టుగా వెనకాల నడిచాడు పోశాలు.

"ఏమక్కా! అంత తయారయినావ్. సూడున్రి - మొగులుమీద నుంచి ఎండ ఎట్ల పొడ్సుకొత్తాందో" అన్నాడు చలపతి.

అందరు జెప్పున తయారు కాన్రి బత్కమ్మ లాడేడ్డి యెక్కడ్నో యెరికేనా? పోశాల్ తాత యింటి ముందట్నే."

దొరగారింటికి బోయే తోవలోనే పోశాలుతాతయిల్లు, గడి ముందర నిలుచుంటే పోశాలు తాతయిల్లు కనబడుతుంది.

బత్కమ్మ తనింటిముందరే అని తెల్సేసరికి, పోశాలు తాతకు కొండంత సంబరమయింది.

"తనింటి ముందట ఆడితె గౌరమ్మకు కోపమొత్తదా? ఏం? దొరే మన్సిగాని నేను మన్సిని కానా? భేషురా సంగపోళ్ళు" అనుకున్నడు.

దొరగారు పోసిన నీతిబోధలు, టీ నీళ్ళు ఎక్కడ పోయాయో.

తన మనుమరాళ్ళతో ఇంటిముందర శుభ్రంగా ఊడ్పించి అలికించి ముగ్గు లేయించాడు, దానిమ్మగింజల వరుసల్లా, వచ్చనివాకిట్లో తెల్లని ముగ్గులు అందాలు చిమ్ముతున్నాయి.

మొట్టమొదట పోశాలు తాత గౌరమ్మ వచ్చి వాకిట్లో కూచుంది, కొత్తపెళ్ళి కూతురులా.

ఇంతకుముందు పండగ లప్పుడు తాము అనుభవించిన అవమానాలూ, తిట్లూ గుర్తున్న ఏ స్త్రీయైనా ఆ వాకిలి విడిచిపెట్టి, దొరగారి చావిట్లోకి అడుగేయడం లేదు. దొర మనుషుల ఆడవాళ్ళు కూడా, తోటి స్త్రీలను కాదని అడుగు ముందుకు వేయలేక పోతున్నారు.

దొర చావిట్లో కూడా అలికారు. సాంబ్రాణి, గుగ్గిలంపొగ వేసారేమో పొగ లేస్తున్నది.

దొరసాన్ల బతుకమ్మలు సిగ్గుపడుతూ బయటకొచ్చినయ్. పూర్తిగా దొరమీదనే ఆధారపడి జీవించేవాళ్ళు మాత్రం అక్కడవున్నారు. వాళ్ళ బతకమ్మలు కూడ అక్కడికే వచ్చాయి.

నిజానికి పోశాల్తాత యింటి ముందరి బతుకమ్మలకంటే అవే అందంగా వున్నాయి. ఇక్కడ బతుకమ్మాట మొదలయ్యింది. అక్కడ చాట్లో ఆట యింకా మొదలేకాలేదు. పెద్దలోకులకి బతుకమ్మ పాటలు రావడం అరుదు. వాళ్ళ వాళ్ళకు గుసగుసలు మొదలయ్యాయి— "పాట నీకొచ్చా" అంటే "నీకొచ్చా" అని. ఒకవేళ ఎవ్వరికైనా వచ్చినా ఇంతకు ముందెన్నడూ పాడలేదాయె— సిగ్గు. ఇవ్వాళ పాడితె ఎట్లుంటుందో.

గడీ— బంగళామీద కిటికీలోంచి చూస్తున్న దొరకళ్ళల్లో పట్టపగటి ఎండ ప్రత్యక్షమయింది.

కంట్లో కారంపొడి చల్లుకుంటున్నడు— దొర.

* * *

ఆనాటి రాత్రి

సంగంలో నూనె దీపం వెలుగుతున్నది.

ఈ వూరికింకా కరంటు రాలేదు.

కరెంటు తెప్పిస్తానని, జనం దగ్గర దొర ఎన్నడో పైసలు వసూలుచేసాడు కానీ రాలేదు. అదేమని అడిగేవాడే లేడాయె, ఇన్నిరోజులు.

కరెంటు విషయంలో సంగం యిదివరకే చర్య తీసుకుంది. జనం నుంచి వసూలు చేసిన డబ్బు వడ్డీతోసహా యిస్తానన్నాడు దొర. దానికింకా నెలరోజులు గడువుంది. ఇక కరెంటు గ్రామానికి రావడం గురించి. మెజారిటీ జనం వెళ్ళి, కరెంటాఫీసుకు ఇంకా తహసీల్దారు, కలక్టరు, వీళ్ళందరి దగ్గరికెళ్ళి ఊరేగింపులు తీసి దరఖాస్తులు పెట్టుకున్నారు సంగం పేరున.

దసరా పండుగకు ప్రతియేడు ఆ వూరి గొల్లవాళ్ళు రెండు గొర్రెలను దొరకు యిచ్చుకోవాలి. ఈ గొర్రెలను జమ్మి దగ్గర కత్తితో నరుకుతారు.

గొర్రెలను నరికే కత్తికి దొరగారే పసుపుకుంకాలు దిద్దుతాడు. కంకణం కట్టుకొని కత్తిని గొర్రెల మెడమీద రాచినట్టు చేస్తాడు దొర. తర్వాత తలారికి ఇస్తాడు. తలారి గొర్రెలమెడలను నరుకుతాడు,

మాంసాన్ని పోగులేసిన తర్వాత, మోదుగు ఆకుల్లోనో మర్రి ఆకుల్లోనో పెట్టి ఇంటింటికి పంపడం ఆచారం. పెద్దలోకులకు ఎప్పటికంత ఎక్కువే ముడుతుంది.

"ఏమాయెనే ఒక్కమాటనరు. 'మీ పన్ను లేముందో జెప్పునిర్రి, మీరు గట్టిగ నిల్సుండనుది, మేమేం జెయ్యం. మీరందరి మాటొక్కటయి, ఒక్క కట్టుమీదున్న రంటే, ఇగంత మేం జూస్కుంటం—" అన్నాడు చలపతి.

"ఇగేం జెప్పుమంటవే? లచ్చన్నా! మాది కట్టంటె కట్టె! అని మొన్ననె జెప్తిమి గద. ఓయాళ్ళ ఎవ్వడన్న యాళ్ళకు పక్కకు తప్పుకుంటె పోనీ. అళ్ళే దొరకెట్టి గొర్లిచ్చుకుంటరు—" అన్నాడు గొల్ల మల్లన్న.

"నూటికి సూరుపాల్లు ఈయ్యేడు దొర ఎట్టిగొర్లియ్యమని రాడు— మిమ్ముల్నో సారి గొట్టిసూద్దామని, సందేలకు సుంకరోన్ని దోలిండు గన్క— ముందు జాగర్త కోసం అందర్దొక్కటే మాటయితె మంచిది.

"నేనింకోటి జెప్తున్ననే— దర్రసకు ఎట్టి గొర్లియ్యకపోతే, ఆయింత మీ గొర్ల కేమన్న గత్తరో గాయో అయితెట్టనే? బాగ అలోసించుకోర్రి— ఎన్కసీరి మామీద మన్నుబోత్తె లాభం లేదు" అన్నడు మల్లయ్య వాళ్ళ మనసు, గుండెల లోతు తెల్సు కుందామని.

"దర్రస కెట్టిగొర్లు గొట్టకపోతే గొర్లకేమయితది? మరిగ గొర్లకు ఆశపడ్డ దేవుడేం దేవుడో? మాంసంకూర మెక్కితినే దేవుడన్నమాట! అనియక్కన్ కుక్క లడుగ— అసోంటి దేవుడు మాకొద్దు!" అన్నాడు ఓదెలు.

"ఏమన్నా గానియ్యే— రే పెట్టి గొర్లిచ్చుడు మాత్రం బందే జేత్తం. దొరకు బాగ అలావాటయ్యింది. పురుళ్ళకు, పుట్టెంటికెలకు— పెళ్ళిల్లకు. పేరంటాలకు ఎట్టి గొర్లియ్యలేక జత్తన్నం. ఓసారి ఈడ్సి, జాడిచ్చి ముడ్డిమీన్కెలి దంతేగాని మానం రాదు లఫ్డికొడుక్కులకు" అన్నాడతనే.

ఓదెలు మాటమీద గొల్లోల్లందరికి చాల గురివుంది. కండలు తిరిగిన శరీరం, మనసు తిక్క గుణం— మంచిమాట కేదంటే అదంటడు— అతనంటే వాళ్ళందరికీ భయం భక్తున్నయి. స్త్రీలంటె మంచి మర్యాదస్తుడు— యింకా, కులపెద్ద మల్లన్నకు స్వయాన బావమరిది.

"అయితె మంచిదాయె— ఇక లేద్దామా? ఇప్పటికే పన్నెండు గొట్టింది." చేతి గడియారం చూసన్నాడు చలపతి.

"ఆఁ.... ఇగ బోదాంగానీ ఇంకో మాటుందిగద మాట్లాడుకునేది? రేపు— జంబిచెట్టుమీది ఆకు మనమే మొట్టమొదలు తెంపాలె— ఎవ్వల్తోటి దెంపిద్దామో అందరు జెప్పుర్రి. అందరిమాట ఒక్కటయితె మంచిగుంట" దన్నాడు మల్లయ్య.

సృజన సంపాదకులకు అభివందనాలు–

జనవరి సృజనలో సినిమాపై వ్యాసం చూశాను.

ఈ నెల ఢిల్లీలో జరిగిన అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో ఆనందూ, ఉత్పలేందూ పాల్గొన్నారు. చిత్రోత్సవాన్ని పురస్కరించుకొని జరిపిన సదస్సులో ఆ ఇద్దరూ తమ అనుభవాలను చెప్పారు. సత్యూ కూడా ఎమర్జెన్సీ కాలంలో ఫిల్మ్స్ డివిజను వాళ్ళకోసం ఒక చిత్రం తీశాడు. దాన్ని అటకెక్కించారు. ఈ సంగతి సత్యూ వివరించాడు.

చలనచిత్రోత్సవం ప్రతినిధులందరికీ కాకపోయినా, సదస్సు సభ్యులకు ఆనంద్ పట్టవర్ధన్ చిత్రాన్నీ ఉత్పలేందు చక్రవర్తి చిత్రాన్నీ వేసి చూపిస్తామన్నారు. ప్రదర్శన ఎప్పుడుంటుందో చెప్తామన్నారు. చెప్పిన వేళకి వేశారో లేదో తెలియదు. (వేస్తామన్నారు అదెంత కాదు!)

---

"ఇంకెవ్వలు తెంపుతరె? నువ్వే దెంపరాదు?" అన్నడు ఎల్లన్న.

"ఆకు దెంపుటానికేంది ఎల్లన్నా! దొరకెదుర్గా యాడికీ మేమే బోవాల్నా? ఇక మీరెప్పుడు బోతరు?" అన్నాడు చలపతి.

అతని మాటకొక్కందరు తగ్గారు– అది నిజమేననిపించి.

"అది నిజమే చలపత్తాతా! కానీ మా అందర్కి మల్లన్నతోటి దెంపిత్తెనే మంచిగుండు ననిపిస్తాంది–" పోశాల్తాత. అతనా వూరందరికీ తాతే.

"ఏంచేలచ్చన్నా ఏమెు ఎన్కడుగేత్తన్నవ్– బయ్యపడ్తున్నవేందే? నీయవ్వ మేమందరం లేమాయె నీకేమన్నయితే? నీమీద పెయ్యేస్కనేంత గుండెలెవడి కున్నయె–" అన్నాడు ఓదెలు.

"అయితె మంచిదింగ లేద్దామా? రేపట్టి సంగపోల్లు మంచిగ హుషార్గుండాలె. బయటికెల్లినమంటె అందర్నేతుల్ల గుత్పకట్టెలుండాలె. ఎందుకంటె దసంటె తాగి తందనాలాడె పండుగ– దొరేమన్న జెయ్యొచ్చు– ఇగ మనోల్లయితె తాగుడు, గీగుడసొంటి ఆసనంటించుకోవద్దు–" చెప్పాడు మల్లయ్య.

అందరు లేచారు– సంగంలో పడుకునేవాళ్ళు బట్టలు పరుచుకున్నారు.

చందమామ సగం ముక్కయ్యాడు, మొగులుసీన, చుక్కల నడుమ, మబ్బుల మధ్య పరుగులు తీస్తున్నాడు.

మబ్బులు మింగుతున్నాయ్, విడిచి పెడుతున్నాయి చందమామను.

*    *    *

...... (ముగింపు వచ్చే సంచికలో)